
సాక్షి నంద్యాల

సోమవారం ౹ 15 ౹ సెప్టెంబర్ ౹ 2025



అన్న ప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలం టెంపుల్: అన్న ప్రసాద వితరణ పథకానికి ఆదివారం భీమవరానికి చెందిన కె. రామ చంద్ర రావు రూ.1,00,500 విరాళాన్ని పర్యవేక్షకులు శివప్రసాద్‌కు అందజేశారు.



ధర లేదు.. అమ్మకాల్లేవు

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఉల్లి గడ్డల నిల్వలు పేరుకుపోయాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ధర పడిపోవడంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 13,024
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 12,666

న్యూస్‌రీల్

మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



దర్శనానికి క్యూ లైన్లలో వేచివున్న భక్తులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో వెలసిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకుని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వేకువ జామున పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి ఆలయ క్యూ లైన్లలో బారులుదీరారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూ లైన్లు నిండి పోయాయి. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులు కళకళలాడుతున్నాయి.

నేడు టమాట రైతులతో ముఖాముఖి

ప్యాపిలి: టమాట రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకునేందుకు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగాల భరత్ రెడ్డి సోమవారం ప్యాపిలి టమాట్ మార్కెట్‌ను సందర్శించనున్నారు. గిట్టుబాటు ధరలేక రైతులు పడుతున్న కష్టాలను నేరుగా తెలుసుకునేందుకు భరత్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు, నాయకులు మధ్యాహ్నం 2 గంటలకు టమాట మార్కెట్‌కు చేరుకుని రైతులతో ముఖాముఖి కానున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఈనెల 15న సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకోవడం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100ను సంప్రదించవచ్చన్నారు. అలాగే అర్జీదారులు దరఖాస్తుల ప్రస్తుత సమాచారాన్ని meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవడంతో పాటు అర్జీలను కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఉదయం 9.30 గంటలకు జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

ముగిసిన పెథాలజీ వైద్యుల రాష్ట్ర సదస్సు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో మూడు రోజులుగా కొనసాగుతున్న పెథాలజి వైద్యుల రాష్ట్ర సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ మెడికల్ కాలేజీల నుంచి 612 మంది వైద్యులు హాజరైనట్లు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ బాలీశ్వరి తెలిపారు. వీరిలో 50 మందికి పైగా ప్రొఫెసర్లు, 75 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 150 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 140 మంది పీజీ వైద్యులు ఉన్నారన్నారు. మూడు రోజుల సదస్సుతో సరికొత్త వైద్య విధానాలను సీనియర్ వైద్యులు వివరించారని పేర్కొన్నారు.



సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

అంతా క్లీన్‌చీట్

టీడీపీ నాయకులు 'ఉపాధి' సిబ్బందితో కుమ్మక్కై గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను కొల్లగొట్టారు. కనీవినీ ఎరుగని రీతిలో 80 శాతం నిధులు స్వాహా చేసి 20 శాతం మాత్రమే ఖర్చు చేశారు. ఇంత స్థాయిలో అక్రమాలు జరిగినా సామాజిక బృందాలు బయటకు తీయలేకపోయాయి. ఓపెన్ ఫోరం నిర్వహించి స్వల్పంగా అవినీతి జరిగిందని, అన్ని పనులు బాగున్నాయని క్లీన్‌చిట్ ఇచ్చాయి. టీడీపీ నాయకులు దోచుకుతింటున్న నిధులను దాచుకోవడానికి అనుకూలంగా సామాజిక బృంద సభ్యులు తనిఖీలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అన్నీ అక్రమాలే
- 'ఉపాధి'కి 2024-25లో ఉమ్మడి జిల్లాలో రూ.675 కోట్ల ఖర్చు
- కూటమి పార్టీల నేతలు కుమ్మక్కై నిధులను కొల్లగొట్టిన వైనం
- ఒకే ఫొటో 10 నుంచి 15 మస్టర్లు వేసి నిధుల స్వాహా
- పైపైనే సామాజిక బృందాల తనిఖీలు
- వంద శాతం పనులు పారదర్శకం అంటూ నివేదిక

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్రంలోకూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 2024-25లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా లేబర్ కాంపోనెంట్ కింద ఉమ్మడి జిల్లాలో రూ.675 కోట్లు ఖర్చు చేశారు. 'ఉపాధి' సిబ్బందితో కూటమి పార్టీల నేతలు కుమ్మక్కై నిధులను కొల్లగొట్టారని విమర్శలు వచ్చాయి. ఇందుకు గ్రామస్థాయిలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లను తప్పించి కూటమి పార్టీలు తమ కార్యకర్తలను నియమించుకున్నారు. ఏపీవోలు, సాంకేతిక సహాయకులు, ఈసీలు తదితరులందరినీ తమకు అనుకూలమైన వారిని నియమించుకున్నారు. 'ఉపాధి' నిధుల్లో జరిగిన అక్రమాలను సామాజిక తనిఖీ బృందాలు వెలికి తీయాల్సి ఉంది. అయితే ఆ బృందాలు అక్రమాలే లేవంటూ క్లీన్‌చీట్ ఇస్తుండటం పలు అనుమానాలకు తావు ఇస్తోంది.

సర్వత్రా ఆశ్చర్యం!

కర్నూలు జిల్లాలో 2024-25లో లేబర్ కాంపోనెంటు కింద రూ.276 కోట్లు, మెటీరియల్ కాంపోనెంటు కింద రూ.105 కోట్లు, నంద్యాల జిల్లాలో కాంపోనెంటు కింద రూ.205, మెటీరియల్ కాంపోనెంటు కింద రూ.89 కోట్లు ఖర్చు చేశారు. ఉపాధి సిబ్బంది, కూటమి పార్టీల నేతలు కుమ్మక్కై నిధులు కొల్లగొట్టినప్పటికీ సామాజిక తనిఖీ బృందాలకు ఇవేమీ కనిపించలేదు. ఒక్క శాతం కూడా దుర్వినియోగం లేని విధంగా ఉపాధి పనులు జరుగుతున్నట్లు సోషల్ ఆడిట్ టీమ్‌లు లెక్కలు చెబుతుండటం పట్ల సర్వత్రా ఆశ్చర్యం వ్యక్తం అవుతోంది. 'ఉపాధి' పనులు ఇంత సవ్యంగా జరుగుతున్నాయా అంటూ ముక్కున వేలేసుకునే పరిస్థితి ఏర్పడుతోంది.

నిధుల స్వాహా ఇలా..

సి.బెళగల్, ఎమ్మిగనూరు, గూడూరు, ఆస్పరి మండలాల్లో సోషల్ ఆడిట్ ఇప్పటికే పూర్తి అయ్యింది. ఓపెన్ ఫోరం కూడా నిర్వహించారు. ఇప్పటి వరకు సోషల్ ఆడిట్ జరిగిన నాలుగు మండలాల్లో నిధులు చాలా తక్కువగా దుర్వినియోగం అయ్యిందని తేల్చారు. లేబర్ కాంపోనెంట్ నిధులు 60 శాతం పక్కదారి పట్టినా బృంద సభ్యులు లేదని చెబుతున్నారు. చాలా చోట్ల కూలీలతో చేయించాల్సిన పనులను యంత్రాలతో చేసి నిధులు స్వాహా చేశారు. పది మంది పనిచేస్తే ఒకే ఫొటో 10 మస్టర్లకుపైగా వేసి నిధులు స్వాహా చేశారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లో దొంగ మస్టర్లతో నిధులు స్వాహా చేసినట్లు విమర్శలు ఉన్నాయి. మెటీరియల్ కాంపోనెంటు కింద చేపట్టే పనుల్లో అక్రమాలదే పై చేయి. అయినా సామాజిక తనిఖీ బృందాలు వెలికి తీస్తున్న అవినీతి, అక్రమాలు చాలా స్వల్పంగా ఉంది.



కర్నూలు జిల్లాలో జరుగుతున్న ఉపాధి పనులు

తనిఖీలు నామమాత్రం

కర్నూలు జిల్లాలో రెండు, నంద్యాల జిల్లాలో రెండు సోషల్ ఆడిట్ టీమ్‌లు పనిచేస్తున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేసిన తొలినాళ్లలో సామాజిక తనిఖీలంటే అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేవి. నేడు సామాజిక తనిఖీలు నామమాత్రం అయ్యాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోషల్ ఆడిట్‌లో పారదర్శకత కనిపించడం లేదని అధికారులే పేర్కొంటున్నారు. ఓపెన్‌ఫోరంలో చూపిన నామమాత్రపు అక్రమాలు కూడా మధ్యలోనే డ్రాప్ అయిపోతున్నాయి. రికవరీ రూ.2 లక్షలు, రూ.3 లక్షల వరకు మాత్రమే ఉంటోంది. సామాజిక తనిఖీ బృంద సభ్యులు కొందరు అక్రమాలు చేసిన 'ఉపాధి' సిబ్బంది, టీడీపీ నేతలతో కుమ్మక్కై, చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నారని విమర్శలు ఉన్నాయి.

'గ్యాప్'లు చూపి!

సి.బెళగల్ మండలంలో 2024-25లో రూ.13 కోట్ల విలువైన 'ఉపాధి' పనులు చేశారు. పనులకు 15 మంది కూలీలు మాత్రమే హాజరైతే 150 మంది అన్నట్లు మస్టర్లు వేసి నిధులు కొల్లగొట్టారు. అక్రమాలపై అప్పటి జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదులు అందాయి. అయితే సామాజిక తనిఖీ బృందాలకు ఈ అక్రమాలు కనిపించలేదు. ఇటీవల సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరం జరగ్గా కేవలం రూ.2.50 లక్షల మాత్రమే అవినీతి జరిగిందని తేల్చారు. పండ్లతోటల్లో ఉన్న గ్యాప్‌లు చూపి నిధులు దుర్వినియోగం అయినట్లు చూపారు. లేబర్ కాంపోనెంట్ కింద చేపట్టిన పనులు వంద శాతం పారదర్శకమేనని ధ్రువీకరించారు.

మమ అనిపించి!

ఎమ్మిగనూరు మండలంలో గత ఆర్థిక సంవత్సరం రూ. 15 కోట్ల మేర 'ఉపాధి' నిధులు ఖర్చు చేశారు. లేబర్, మెటీరియల్ కాంపోనెంట్ కింద పెద్ద ఎత్తున పనులు చేశారు. టీడీపీ నేతలు, 'ఉపాధి' సిబ్బంది కుమ్మక్కై బోగస్ మస్టర్లతో నిధులు స్వాహా చేశారు. అయితే సోషల్ ఆడిట్ టీమ్‌లు అక్రమాలపై దృష్టి సారించలేదు. పైపైనే పరిశీలించి మమ అనిపించారు. ఈ మండలంలో సామాజిక తనిఖీలు జరగడంతో పాటు ఇటీవలనే ఓపెన్ ఫోరం కూడా నిర్వహించారు. కేవలం రూ.2 లక్షల వరకు మాత్రమే నిధుల దుర్వినియోగం జరిగినట్లు సోషల్ ఆడిట్ టీమ్‌లు తేల్చాయి.





ఒకే ఫొటోతో వివిధ పేర్ల మీద రూపొందించిన మస్టర్లు

విద్యుత్ ఉద్యోగుల ఉద్యమ బాట

- నేటి నుంచి ఆందోళన కార్యక్రమాలు
- జేఏసీగా మారిన 23 సంఘాలు



కర్నూలు(అగ్రికల్చర్): తమ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ ఉద్యోగులు ఉద్యమ బాట పట్టనున్నారు. ఈ నెల 15 నుంచి వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికను ఏపీ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) సిద్ధం చేసింది. జేఏసీలో 1104, 327, డిప్లొమా ఇంజినీర్స్, బీసీ, ఓసీ, బహుజన ఉద్యోగ సంఘాలు మొత్తంగా 23 ఉన్నాయి. ఈ నెల 15 నుంచి చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాలపై జేఏసీ ప్రతినిధులు ఈ నెల 6న విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతికి నోటీసు ఇచ్చారు. ప్రధాన సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయినందున ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్లు ఆదివారం జేఏసీ నేతలు విలేకరులకు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లు ఇవీ..

➡ నగదు రహిత వైద్యం అందించాలి.

➡ 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004 ఆగస్టు 31 మధ్య చేరిన ఉద్యోగులకు పెన్షన్ సదుపాయం కల్పించాలి.

➡ దళారీ వ్యవస్థను రద్దు చేసి కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించాలి.

➡ మొత్తం 13 రకాల డిమాండ్‌లను పరిష్కరించాల్సి ఉంది. వీటిలో కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించి ఆరు డిమాండ్‌లు ఉన్నాయి.

నిరసనలు ఇలా..

☛ ఈ నెల 15,16 తేదీల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తారు.

☛ 17, 18 తేదీల్లో భోజన విరామ సమయాల్లో ఆందోళనలు చేపడతారు.

☛ 19, 20 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు చేస్తారు.

☛ 22న ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్‌కు మెమొరాండం సమర్పిస్తామని జేఏసీ నేతలు సతీష్‌కుమార్, లక్ష్మీకాంతరెడ్డి, రామరాజు, రమణమూర్తి, సయ్యద్ బాషా తెలిపారు.

శ్రీమఠం ప్రాంగణంలో రథోత్సవం



వెండి రథంపై దివ్య తేజం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో ఆదివారం రాత్రి వెండి రథయాత్ర రమణీయంగా సాగింది. వెండి రథంపై ప్రహ్లాద రాయలను అధిష్ఠింపజేసి భక్త జనం మధ్య ఊరేగింపు చేపట్టారు. శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థమై ఇరు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. మందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శనం చేసుకొని అనంతరం శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనాన్ని దర్శించుకున్నారు. అన్నపూర్ణ భోజనశాల, పరిమళ ప్రసాద కౌంటర్ల ముందు భక్తుల రద్దీ కనిపించింది.

అన్యాయం జరిగితే నిర్భయంగా ఫిర్యాదు చేయండి

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సునీల్ షేరాన్



ఎస్పీగా బాధ్యతలు చేపడుతున్న సునీల్ షేరాన్

నంద్యాల: అన్యాయం జరిగితే ప్రజలు పోలీసు స్టేషన్‌లో నిర్భయంగా ఫిర్యాదు చేసేలా వాతావరణం కల్పిస్తానని జిల్లా నూతన ఎస్పీ సునీల్ షేరాన్ అన్నారు. విశాఖపట్నంలో గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా పని చేస్తున్న ఆయన నంద్యాల జిల్లా ఎస్పీగా బదిలీపై వచ్చారు. ఈ మేరకు ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా నుంచి ఆదివారం సునీల్ షేరాన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ జావళి ఆల్ఫోన్స్, సాయుధ బలగాల అదనపు ఎస్పీ శ్రీనివాసులు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు డీఎస్పీలు ప్రమోద్, రామాంజినాయక్‌లతో పాటు సీఐలు, ఎస్ఐలు ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం పెంచేలా సమర్థవంతమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించడంతో పాటు ప్రజల శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించేది లేదని, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆరుతడి.. సాగు తడబడి..!

- ఖరీఫ్‌లో ఆరుతడి పంటల సాగు అంతంత మాత్రమే
- ఈ ఏడాది భారీగా తగ్గిన పత్తి సాగు విస్తీర్ణం
- జిల్లాలో 5,419 హెక్టార్లకే పరిమితం
- పడిపోయిన వేరుశనగ, ఆముదం, పొద్దుతిరుగుడు పంటల సాగు
- పంట చేతికందే తరుణంలో మినుము రైతుకు నష్టం



ఖరీఫ్‌లో సాగైన పెసర పంట

కోవెలకుంట్ల: రెండేళ్లుగా జిల్లా రైతులకు ఆరుతడి పంటల సాగు కలసి రావడం లేదు. గతంలో సాధారణ విస్తీర్ణం మించి సాగయ్యేది. గత ఖరీఫ్ నుంచి ఆరుతడి పంటల సాగు లక్ష్యాన్ని చేరుకోలేకపోతోంది. మరో పదిహేను రోజుల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముగియనుంది. సీజన్ మొదట్లో వర్షాభావం, విత్తనం వేసేనాటికి అధిక వర్షాలు, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో జిల్లాలో ఆరుతడి పంటల సాగు చతికిలబడింది. జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 2,10,913 హెక్టార్లలో వివిధ పంటల సాగు సాధారణ విస్తీర్ణంగా కాగా ఆయా మండలాల్లో ఇప్పటి వరకు 1,91, 300 హెక్టార్లలో రైతులు పంటలు సాగు చేయగలిగారు. ఇందులో 88,205 హెక్టార్లలో ఆరుతడి పంటలు సాగు కావాల్సి ఉండగా 65 వేల హెక్టార్లలో మాత్రమే సాగు అయ్యాయి. గత నెల 15 నాటికే ప్రధాన ఆరుతడి పంటలైన వేరుశనగ, పత్తి, పెసర, సోయాబీన్, పొద్దుతిరుగుడు, తదితర పంటల సాగుకు అదును ముగిసింది. ఎర్ర రేగడి నేలల్లో మాత్రం కంది, ఆముదం, అలసంద, తదితర పంటలు సాగు చేసుకునే ఆస్కారం ఉంది.

భారీగా తగ్గిన పత్తి, వేరుశనగ విస్తీర్ణం..

ప్రధాన ఆరుతడి పంటలుగా పేరుగాంచిన పత్తి, వేరుశనగ సాగు విస్తీర్ణం ఈ ఏడాది జిల్లాలో భారీగా తగ్గింది. ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నాటి నుంచే ఈ పంటలు సాగు చేసేవారు. ఈ ఏడాది సీజన్‌కు ముందు మే నెలలో విస్తారంగా వర్షాలు కురిసినా జూన్ నెలలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురియకపోవడంతో సాగు కనిష్ట స్థాయికి పడిపోయింది. కూటమి ప్రభుత్వం సకాలంలో వేరుశనగ విత్తనాలను రైతులకు సరఫరా చేయకపోవడంతో సాగుపై రైతులు పెద్దగా ఆసక్తి కనబరచలేదు. జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో 11,943 హెక్టార్లలో వేరుశనగ సాగు కావాల్సి ఉండగా 7,331 హెక్టార్లలో సాగు చేయగలిగారు. అలాగే 18,827 హెక్టార్లలో ముంగారి, హైబ్రీడ్, డబుల్‌ఫోర్, క్రాసింగ్, తదితర పత్తి రకాల సాగు చేయాల్సి ఉండగా సాగు కేవలం 5,419 హెక్టార్లలకు మాత్రమే పడిపోయింది. మినుము సాధారణ విస్తీర్ణాన్ని మించి సాగు అయినా పంట కోత, నూర్పిడి సమయంలో కురిసిన భారీ వర్షాలతో పంట దెబ్బతిని రైతులకు నష్టం వాటిల్లింది. ఆముదం, పెసర, పొద్దుతిరుగుడు, తదితర పంటల సాగు లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది.

జిల్లాలో ఆరుతడి పంటల సాగు వివరాలు (హెక్టార్లలో)..

పంట	సాధారణ విస్తీర్ణం	సాగైన విస్తీర్ణం
పత్తి	18,827	5,419
వేరుశనగ	11,943	7,331
జొన్న	872	104
పొద్దుతిరుగుడు	389	35
పెసర	279	40
కొర్ర	1,855	1,202
కంది	36,243	34,112
మినుము	9,700	10,484
ఆముదం	2,921	1,882
సోయాబీన్	4,176	4,600

సీజన్ మధ్యలో దెబ్బతీసిన భారీ వర్షాలు

సాధారణంగా ఖరీఫ్‌లో జూన్, జూలై నెలల్లో వేరుశనగ, కంది, మినుము, సోయాబీన్, పత్తి, తదితర పంటల సాగు చేసేందుకు సరైన అదును. జూన్, జులై నెలల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. ఆగస్టు 15 లోపు ఆయా పంటలు సాగు చేసుకోవచ్చుకుంటే ఆగస్టు నెలలో భారీ వర్షాలు రైతులను వెంటాడాయి. ఆ నెలలో వరుసగా కురిసిన వర్షాలతో పంటల సాగుకు ఆటంకం కలిగింది. పొలాల్లో తేమ ఆరకపోవడం, సాగుకు గడువు ముగియడంతో ఆరుతడి పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. ఖరీఫ్ చివరి పంటగా జొన్న సాగుకు సరైన అదును కాగా నాలుగు రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో జొన్న సాగు ముందుకు సాగడం లేదు. సెప్టెంబర్ నెలలో సైతం వర్షాలు వెంటాడుతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కోవెలకుంట్ల సమీపంలో పత్తి పంట సాగు చేసిన దృశ్యం

ఆరున్నర ఎకరాల్లో పంటలు వేశా..



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రెండు ఎకరాల్లో మొక్కజొన్న, మూడు ఎకరాల్లో జొన్న, ఒకటిన్నర ఎకరాల్లో మిరప సాగు చేశాను. గత ఏడాది మిరప సాగుతో తీవ్ర నష్టం రావడంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గించి ఆరుతడి పంట అయిన జొన్న సాగు చేశాను. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 10 వేల వరకు వెచ్చించాను.

– కుళాయప్ప, రైతు, అమడాల, కోవెలకుంట్ల మండలం

పెసర దెబ్బతినింది



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఏడు ఎకరాల్లో పెసర పంట సాగు చేశాను. విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర రూపంలో ఎకరాకు రూ. 6 వేలు వెచ్చించాను. పంట చేతికందే తరుణంలో గత నెలలో కురిసిన భారీ వర్షాలతకు తెగుళ్లు ఆశించి పైరు పూర్తిగా దెబ్బతినడంతో తొలగించాను. పెసరతోపాటు ఐదు ఎకరాల్లో కంది, మరో పది ఎకరాల్లో వరి సాగు చేశాను.

– వెంకటేశ్వరరెడ్డి, రైతు, కంపమల్ల, కోవెలకుంట్ల మండలం

సమాచార శాఖ డీఐపీఆర్‌ఓగా మల్లికార్జునయ్య



నంద్యాల: జిల్లా డీఐపీఆర్‌ఓగా మల్లికార్జునయ్యను నియమిస్తూ సమాచార శాఖ డైరెక్టర్ హిమాన్స్‌శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న పురుషోత్తంను సత్యసాయి జిల్లాకు బదిలీ చేశారు. ఈ మేరకు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డీఐపీఆర్‌ఓ)గా జె.మల్లికార్జునయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో డీపీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తూ కర్నూలు సహాయ సంచాలకులుగా పదోన్నతి పొందానన్నారు. దీంతో పాటు నంద్యాల డీఐపీఆర్‌ఓగా పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చారన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి సలహాలు, సూచనలు పాటిస్తూ అధికార కార్యక్రమాలను మీడియా ద్వారా విస్తృతం చేస్తామన్నారు.

కుమారుడిని హత్య చేసిన తండ్రి అరెస్ట్

దేవనకొండ: కుమారుడిని నీటి డ్రమ్ములో ముంచి హత్య చేసిన తండ్రి నరేష్‌ను అరెస్టు చేసినట్లు సీఐ వంశీనాథ్ ఆదివారం విలేకరులకు తెలిపారు. నిందితుడిని పత్తికొండ మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరిచినట్లు చెప్పారు. దేవనకొండకు చెందిన చాకలి నరేష్, శ్రావణికి ఎనిమిది నెలల కుమారుడు సాగర్ ఉన్నాడు. నిత్యం భార్యతో గొడవ పెట్టుకునే నరేష్.. దేవనకొండలో గత రెండు రోజుల క్రితం కుమారుడిని నీటి డ్రమ్ములో ముంచి హత్య చేసిన విషయం తెలిసిందే.

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది. ప్రెస్ మీట్‌లో ఓ నేత ఇచ్చిన వార్తను ప్రచురిస్తే కేసులు పెట్టడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలను నిర్భయంగా ప్రజలకు కళ్లకు కట్టినట్లు తెలియజేస్తున్న 'సాక్షి' దినపత్రికపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై, సంబంధిత జర్నలిస్టుపై అక్రమ కేసులు పెట్టి వేధించడం దుర్మార్గమైన చర్య. వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న 'సాక్షి'పై కూటమి ప్రభుత్వం మొదటి నుంచి వేధించే ధోరణి అవలంబిస్తోంది. ఎమర్జెన్సీ లాంటి పాలన ఇలాగే కొనసాగితే ప్రజా ఉద్యమం తప్పదు. – **కంగాటి శ్రీదేవి, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే**



అప్రకటిత ఎమర్జెన్సీ!



విధి నిర్వహణలో భాగంగా జర్నలిస్టులు వార్తలు ఇస్తుంటారు. అయితే అధికార పార్టీ నేతలు ఇవి గుర్తించుకుండా 'సాక్షి' జర్నలిస్టులను రాజకీయాలు అపాదించడం అన్యాయం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో వార్తలు రాసిన 'సాక్షి' జర్నలిస్టులు, ఎడిటర్‌పై కేసులు నమోదు చేస్తున్నారు. కడపలో సాగునీటి సంఘాల ఎన్నికలు, జెడ్పీటీసీ ఎన్నికల్లో కవరేజ్‌కు వెళ్లిన వారిపై కూడా దాడులు జరిగాయి. కర్నూలులోనూ సాక్షి జర్నలిస్టులపై కేసులు పెట్టారు. ఇలా కేసులు పెట్టుకుంటూ పోతుండడంతో ప్రజాస్వామ్యానికే ఇబ్బందికరంగా మారింది. ఒకరకంగా చెప్పాలంటే అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోంది. ఇది మంచి పద్ధతి కాదు. ప్రభుత్వం ఆలోచన చేయాలి. జర్నలిస్టులను ఇబ్బందులు పెడితే ఆందోళనలకు సిద్ధమవుతాం. – **ఈఎస్ రాజు, జిల్లా కార్యదర్శి, ఏపీయూడబ్ల్యూజే**

క్లుప్తంగా

ఆగివున్న ట్యాంకర్‌ను ఢీకొట్టిన లారీ



ఆగిన ట్యాంకర్‌ను ఢీకొట్టిన లారీ

కోడుమూరు రూరల్: కోడుమూరు – కర్నూలు రహదారిలో కొత్తూరు వద్ద ఆగి ఉన్న ట్యాంకర్‌ను ప్రమాదవశాత్తూ లారీ ఢీకొంది. బళ్లారి నుంచి గడివేములకు వెళ్తున్న ఓ లారీ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఆగి వున్న ట్యాంకర్‌ను వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం నుజ్జునుజ్జు అయినా లారీ డ్రైవర్ విజయ్ క్షేమంగా బయటపడ్డాడు.

మెట్లపై నుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన రమణయ్య

కోవెలకుంట్ల: పట్టణంలోని బొల్లవరం వీధిలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి మెట్లపై నుంచి జారి పడి మృతి చెందాడు. ఆదివారం ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి అందించిన సమాచారం మేరకు.. కాలనీకి చెందిన ఆకుల రమణయ్య(59) శనివారం సాయంత్రం ఇంటిపైన ఉన్న వస్తువును అందుకునేందుకు మెట్లపైకి ఎక్కి ప్రమాదవశాత్తు కింద పడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతుని భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొనసాగుతున్న గాలింపు



కుందూనదిలో గాలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు

ఉయ్యాలవాడ: కుందూనదిలో శనివారం దూకిన వృద్ధురాలు గుత్తి ఫకూర్‌బీ కోసం ఆదివారం తహసీల్దార్ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో నంద్యాల ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపట్టింది. అనారోగ్య కారణాలతో వృద్ధురాలు కుందూనదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. నీటి ఉధృతి అధికంగా ఉండటంతో ఆమె ఆచూకీ గల్లంతు అయ్యింది. ఎస్‌డీఆర్‌ఎఫ్ ఆర్‌ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, ధనుంజయ, గిడ్డయ్యలతో పాటు మరి కొందరు బోట్ ద్వారా మండల పరిధిలోని పెద్దయమ్మనూరు, బోడెమ్మనూరు వద్ద కుందూనదిలో గాలింపు చర్యలు ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు చాగలమర్రి మండలం రాజోలు వరకు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ వృద్ధురాలి ఆచూకీ లభ్యం కాలేదని తహసీల్దార్ తెలిపారు.

'వేదావతి'లో ఇసుకాసురులు!



హొళగుంద మండలం మార్లమడికి వద్ద వేదావతి నది నుంచి ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్న దృశ్యం

- అధికారం మాటున ఇసుక అక్రమ రవాణా
- పట్టించుకోని అధికారులు, పోలీసులు

ఆలూరు రూరల్: అనుమతి లేని తవ్వకాలతో అక్రమార్కులు వేదావతి నదిని తోడేస్తున్నారు. అధికారం మాటున అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. అయినా అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదు. హొళగుంద మండలం పరిధిలోని మార్లమడికి గ్రామ సమీపంలోని వేదావతి నది నుంచి ప్రతి రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. వాస్తవానికి వేదావతి నదిలోని ఈ ప్రాంతంలో ఇసుక తవ్వకాలను అనుమతి లేదు. సంబంధిత అధికారుల సహాయ సహకారాలతో అక్రమార్కులు ఒక్క ట్రాక్టర్‌కు అనుమతి తీసుకుని రోజుకు పది ట్రాక్టర్ ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అభివృద్ధి పనులు, గృహ నిర్మాణాలకు ఎలాంటి రాయితీ లేకుండా ఇసుక తరలించుకోవచ్చు. అయితే ఇసుక అవసరం ఉన్న వారు ట్రాక్టర్ ఇసుకు రూ.3 వేల నుంచి రూ. 4 వేలు చెల్లించి తోలుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అక్రమాలకు రైట్ రైట్!

కళ్లెదుట ఇసుక అక్రమంగా రవాణా జరుగుతున్నా అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదు. తమకు నచ్చని వారి ట్రాక్టర్లు సీజ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నెల రోజుల నుంచి హొళగుంద మండలంలోని మార్లమడికి సమీపంలోని వేదావతి నది నుంచి పదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు వెళ్తున్నా ప్రశ్నించేవారు కరువయ్యారు. కాసులకు కక్కుర్తి పడి హాలహర్వి, హొళగుంద మండలాల్లోని వేదావతి నది నుంచి టన్నుల కొద్ది ఇసుకను తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు.

చర్యలు తీసుకోవాలి



వేదావతి నది నుంచి ఇసుక తరలిస్తున్న అక్రమార్కులను అధికారులు నిలువరించాలి. సామాన్యులకు ఇసుక అందుబాటులో ఉండేలా చొరవ చూపాలి. అనుమతులు ఉన్న చోటనే ఇసుక తవ్వకాలు జరిపి తరలించేలా చర్యలు తీసుకోవాలి. అభివృద్ధి పనులు, ప్రజల ఉపయోగాల కోసమే ఇసుక అందేలా చూడాలి. సామాన్యులకు ఉచితంగా ఇసుక అందుబాటులో ఉండాలి. అధికారులకు ఇష్టమున్న వారికి మాత్రమే ఇసుక తరలింపు అనుమతులు ఇవ్వరాదు.
– **విరూపాక్షి, ఎమ్మెల్యే, ఆలూరు**

ధర లేదు.. అమ్మకాల్లేవు..

కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లిగడ్డల నిల్వలు పేరుకుపోయాయి. ఇటు వ్యాపారులు, అటు మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లిగడ్డలు బయటకు వెళ్లడం లేదు. దీంతో మార్కెట్‌లో గత రెండు రోజుల నుంచి ఉల్లిగడ్డల కొనుగోలు నిలిచిపోయింది. మరోవైపు ఆదివారం మధ్యాహ్నం నుంచి రైతులు మార్కెట్ యార్డుకు వాహనాల్లో ఉల్లిగడ్డలు తెస్తున్నారు. లోపల ఉన్న సరుకు ఖాళీ కాకపోవడంతో అధికారులు ఆ ఉల్లిని లోనికి అనుమతించడం లేదు. దీంతో మార్కెట్ యార్డు గేటు నుంచి చౌరస్తా వరకు ఉల్లిలోడ్‌తో వందలాది వాహనాలు నిలిచిపోయాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉల్లి ధర పడిపోవడంతో పాటు కొనుగోలు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



మార్కెట్ నుంచి బళ్లారి చౌరస్తా వరకు నిలిచిపోయిన ఉల్లి లోడ్ వాహనాలు



కొనుగోలు నిలిచిపోవడంతో దిగాలుగా కూర్చున్న ఉల్లి రైతులు

సెల్ఫీలు దిగుతూ.. జలకాలాడుతూ

- జీడీపీ వద్ద సందర్శకుల సందడి



ప్రాజెక్టు దిగువన పర్యాటకులు

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్ట్‌కు వరద నీరు పోటెత్తింది. అధికారులు గేట్లు ఎత్తి హంద్రీకి నీరు వదిలారు. ఈ నేపథ్యంలో జీడీపీకి సందర్శకుల తాకిడి పెరిగింది. ఆదివారం చుట్టుపక్కల గ్రామాల నుంచి యువకులు, మహిళలు, చిన్నారులు అక్కడికి చేరుకొని ఫొటోలు దిగుతూ..నీటిలో జలకాలాడుతూ సందడి చేశారు. కాగా ఆదివారం గాజులదిన్నె ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి 500 క్యూసెక్కుల వరద నీరు రాగా దిగువకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. హంద్రీనది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీటిపారుదల శాఖ ఈఈ పాండురంగయ్య సూచించారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న హంద్రీనది



బస్తిపాడు వద్ద ప్రవహిస్తున్న హంద్రీనది

కల్లూరు: హంద్రీనది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు గాజులదిన్నె ప్రాజెక్టు నిండడంతో శనివారం అధికారులు ఆ ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి హంద్రీకి నీరు వదిలారు. దీంతో ఆ నీరు మండలంలోని రేమడూరు, పుసులూరు, బొల్లవరం, నాయకల్లు, బస్తిపాడు, చిన్నటేకూరు, పెద్దటేకూరు, లక్ష్మీపురం, కర్నూలు మీదుగా కర్నూలు నగరంలో తుంగభద్రనదిలో కలుస్తుంది.

వాల్మీకి ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శిగా బోయ లక్ష్మీనారాయణ



రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బోయ లక్ష్మీనారాయణతో వాల్మీకి ఉద్యోగ నేతలు

కర్నూలు(అర్బన్): వాల్మీకి ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన డాక్టర్ బోయ లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి వాల్మీకి ఉద్యోగుల సమావేశంలో రాష్ట్ర కమిటీకి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో లక్ష్మీనారాయణతో పాటు జిల్లాకు చెందిన గవిగట్టు లక్ష్మీకాంత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, సహాయ కార్యదర్శిగా నల్లబోతుల రఘునాథ్ ఎన్నికైనట్లు జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మల్లన్న, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌బాబు, కోశాధికారి వెంకటరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వాల్మీకి ఉద్యోగుల సంక్షేమం కోసం, వాల్మీకి విద్యార్థుల భవిష్యత్తు కోసం రాష్ట్ర నాయకత్వం సమర్థవంతంగా పని చేస్తుందనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.

అపూర్వం.. ఆపాత మధురం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): ముడుతల ముఖం.. తెల్లగా నెరిసిన జుట్టు.. ఊతకర్ర సహాయంతో నడుస్తూ కొందరు.. చూపు తగ్గి.. ఒంట్లో సత్తువ లేక అడుగుల్లో అడుగులు వేస్తూ మరి కొందరు.. ఒక చోట చేరి నాటి గురువులు చెప్పిన పాఠాలను.. స్నేహితుల అల్లరిని గుర్తు చేసుకుంటూ జ్ఞాపకాల జడివానలో తడిసి ముద్దయ్యారు. ఏడు పదుల వయస్సులో వారంతా దాదాపు 50 ఏళ్ల తర్వాత కలుసుకుని నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1973–76 బీఎస్సీ డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఉద్యోగాలు, కుటుంబ పరంగా ఎంతో దూరంగా ఉన్న వీరంతా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని నాటి మధురానుభూతులను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ తదితర ప్రాంతాల్లో స్థిరపడిన కొందరు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కుటుంబ వివరాలు, తమ జీవితంలో ఎదురైన ఘటనలు, అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమానికి అధ్యాపకులు రామచంద్రారెడ్డి, రామిరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాదాపు 50 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒక చోట కూడి ఆప్యాయతలు, అనురాగాల మధ్య వేడుక చేసుకోవడం అభినందనీయమన్నారు. రిటైర్డు హెచ్‌ఎం చంద్రశేఖర్ ప్రార్థనా గీతంతో ప్రారంభించి చక్కటి పాటలు పాడారు. రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ విల్సన్‌తో గిటారు వాయించడం, నంద్యాల ప్రముఖ గాయకుడు ప్రభాకర్ చక్కటి పాటలతో అలరించారు. కార్యక్రమంలో రిటైర్డు డిప్యూటీ విద్యాశాఖ అధికారి బ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంట దిగుబడుల అంచనాకు ప్రయోగాలు

కర్నూలు(అగ్రికల్చర్): పంట దిగుబడులను అంచనా వేసేందుకు, ప్రధానమంత్రి ఫసల్ బీమా పరిహారం మంజూరుకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 786 పంట కోత ప్రయోగాలు నిర్వహించనున్నారు. ఈప్రయోగాలు వ్యవసాయ శాఖ, జిల్లా ప్రణాళిక విభాగం సంయుక్తంగా నిర్వహించనున్నాయి. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 4.22 లక్షల హెక్టార్లు ఉండగా ఇప్పటి వరకు 3.46 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. వరిలో 84, సజ్జలో 26, కొర్రలో 26, జొన్నలో 36, కందిలో 54, మొక్కజొన్నలో 36, వేరుశనగలో 160, ప్రొద్దుతిరుగుడులో 26, ఆముదంలో 54, మిర్చిలో 54, పత్తిలో 240 ప్రకారం పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తారు.

వాల్మీకి గుహలకు పర్యాటకుల తాకిడి

ప్యాపిలి: మండల పరిధిలోని బోయవాండ్లపల్లి గ్రామంలో వెలసిన వాల్మీకి గుహల్లో శని, ఆదివారాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. సెలవు రోజులు కావడంతో ఇతర జిల్లాల నుంచే కాక కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దాదాపు వంద మందికి పైగా కర్ణాటక వాసులు రావడంతో గుహల వద్ద సందడి వాతావరణం నెలకొంది. గుహల విశేషాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సహజసిద్ధంగా వెలసిన ఈ గుహల్లోకి వెళ్లి మరపురాని అనుభూతి చెందామని వారు వివరించారు.



గుహల ముఖద్వారం వద్ద కర్ణాటక పర్యాటకులు

మద్యానికి బానిసై.. వ్యక్తి బలవన్మరణం

ఆదోని అర్బన్: పట్టణంలోని శుక్రవారం పేటకు చెందిన బోయ దుర్గప్ప(43) అనే వ్యక్తి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించే బోయ దుర్గప్పకు భార్య చిన్నలక్ష్మి, ఇద్దరు పిల్లలున్నారు. అయితే, ఈయన కొద్ది కాలంగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు ఎంత వారించినా మద్యం తాగడం మానని అతను ఉన్నట్టుండి ఆదివారం ఇంట్లో ఎవ్వరూ లేనప్పుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు మృతుడి తండ్రి కొలుట్లయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గని గుంతలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని ముళ్ల పొదలమధ్య ఉన్న గని గుంతలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటపడింది. ఆదివారం కొందరు వ్యక్తులు నీటిలో తేలుతున్న మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతదేహం ఉబ్బిపోయి గుర్తుపట్టలేని విధంగా ఉందని, సోమవారం ఉదయం బయటకు తీసి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం



సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్

కర్నూలు(అగ్రికల్చర్): పోలీసులతో పాటు ప్రజలు వాకింగ్, వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఫిట్ ఇండియా, సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని పోలీసు శాఖ చేపట్టింది. ఏఆర్ అడిషినల్ ఎస్పీ కృష్ణమోహన్ పచ్చ జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. కొండారెడ్డి బురుజు నుంచి ప్రారంభమైన ర్యాలీ పాత కంట్రోల్ రూము, కిడ్స్ వరల్డ్ మీదుగా రాజ్‌విహార్ వరకు వెళ్లి తిరిగి జిల్లా పోలీసు కార్యాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని, ఇందులో పోలీసులతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనవచ్చన్నారు. సైక్లింగ్, ఇతర వ్యాయామాల ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. ఆర్‌ఐ నారాయణ, ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్ పోలీసులు పాల్గొన్నారు.

సమాజాన్ని మార్చే ఆయుధం సాహిత్యం



'పుంజు తోక' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్: సమాజాన్ని మార్చే ఆయుధం సాహిత్యం అవ్వాలని తెలంగాణ రాష్ట్రం విశ్రాంత అడిషనల్ డీజీపీ కొత్తకోట శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆయన రచించిన 'పుంజు తోక' పుస్తకాన్ని ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఆయన తల్లిదండ్రులు కృష్ణవేణి, చిన్న సత్యనారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక మార్పు దిశగా ఇకపై కలం పోరు చేస్తానన్నారు. యువత సాహిత్య రచనలో భాగస్వాములు కావాలన్నారు. రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడుతూ.. సమాజ మార్పునకు సాహిత్య రచన దోహదం చేస్తుందన్నారు. కవిత్వం ద్వారా కవులు సమాజానికి ఎంతో సేవ చేస్తారన్నారు. సాహితీ వేత్తలు డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, డాక్టర్ ఎం.హరికిషన్ పుస్తక సమీక్ష చేశారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడారు. కన్వీనర్‌గా మహమ్మద్ మియ్యా వ్యవహరించారు. శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పీబీవీ సుబ్బయ్య, కళాక్షేత్రం కార్యదర్శి సి.యాగంటీశ్వర్, కోశాధికారి రామస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

బాలింత మృతి.. కుటుంబ సభ్యుల ఆందోళన

- ఆసుపత్రిపై దాడి చేసి అద్దాలు ధ్వంసం చేసిన బాధితులు



మృతి చెందిన హబీబా(ఫైల్)

గోస్పాడు: వైద్యులు నిర్లక్ష్య కారణంగానే బాలింత మృతి చెందిందని ఆరోపిస్తూ ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట మృతురాలి కుటుంబ సభ్యులు, బంధులు ఆందోళనకు దిగారు. ఆగ్రహంతో ఆసుపత్రి అద్దాలు ధ్వంసం చేశారు. మృతురాలి తండ్రి జమాల్‌బాషా తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల మండలం పులిమద్ది గ్రామానికి చెందిన షేక్షావలికి శిరివెళ్లకు చెందిన హబీబాతో ఏడాది క్రితం వివాహమైంది. గర్భం దాల్చినప్పటి నుంచి ఆమె నంద్యాల పట్టణంలోని నెరవాటి ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటోంది. శనివారం సాయంత్రం పురిటి నొప్పులు రావడంతో ఆసుపత్రికి వచ్చారు. వైద్యులు సిజేరియన్ చేసి బిడ్డను బయటకు తీశారు. ఈ సమయంలోనే బాలింతకు ఫిట్స్ వచ్చాయని, రక్తం అవసరమని వెంటనే పట్టణంలోని మరో ప్రైవేటు ఆసుపత్రి ఎస్‌వి టీసీకి తరలించారు. అక్కడ వెళ్లిన కొద్ది గంటల్లోనే హబీబా చనిపోయినట్లు చెప్పారు. రక్తం తక్కువగా ఉందని మొదట్లో చెప్పకపోగా.. రెగ్యులర్‌గా చూసే పెద్ద డాక్టర్ కాకుండా ఇతరులతో ఆపరేషన్ చేయించారని మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపిస్తూ నెరవాటి ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. ఈ క్రమంలో రాళ్లతో ఆసుపత్రిపై దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. పోలీసులు రంగప్రవేశం చేసి సర్దిచెప్పారు. బాలింత మృతిపై నెరవాటి ఆసుపత్రి అధినేత డాక్టర్ వినోద్‌కుమార్ వివరణ కోరగా సర్జరీ సమయంలో ఫిట్స్ రావడంతో ఆమె కోలుకోలేక మృతిచెందిందని వెల్లడించారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని నంద్యాల టూటౌన్ సీఐ అస్రార్ బాషా తెలిపారు.